


PRGI NO : TGTEL /25/A0438

# స్టార్ త్రినేత్రం

అనుక్షణం అక్షరసత్యం | తెలుగు దినపత్రిక




| వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 6 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | మంగళవారం, 03 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 2 |
|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL-1 | ISSUE-06 | Editor: D.SHIVAKRISHNA | TUESDAY 03 JUNE 2025 | Pages:4 | Price:2 |




## పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.. పాల్గొన్న సీఎం రేవంత్

**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**
తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జపాన్‌లోని కితక్యూషూ సిటీ మేయర్ కజుహిసా టకేచీ హాజరయ్యారు. వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



## భారత విమానయాన రంగంలో పెట్టుబడులకు అద్భుత అవకాశాలు: ప్రధాని మోదీ

**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**
వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన రంగంలో ప్రముఖ గ్లోబల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 42 ఏళ్ల తర్వాత దేశంలో జరుగుతున్న గ్లోబల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2030 నాటికి నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) సెగ్మెంట్ పరిమాణాన్ని 4 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రపంచ వాయు రవాణా పరిశ్రమ లో భారత విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.
"ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ పౌర విమానయాన మార్కెట్ భారత్‌దే. భారత్‌ను ప్రపంచం కేవలం విమానయాన మార్కెట్‌గా మాత్రమే కాకుండా వాల్యూ చైన్ లీడర్‌గా చూడాలని కోరుకుంటున్నాం. మా దిశ సరైంది. మా వేగం సరైంది.. అందు వల్ల మేం శరవేగంగా ముందుకు దూసు కెళ్లడాన్ని కొన సాగిస్తాం" అన్నారు. ప్రపంచ స్థాయ విమా నాశ్రయాల్లో భారత్ పెట్టు బడులు పెడుతోం దన్న ప్రధాని.. విమా నాశ్రయాల సంఖ్య 74 నుంచి 162కి పెరిగిందన్నారు. ఉడాన్ పథకం విజయ వంతం కావడం భారత పౌర విమాన యానరంగంలో ఒక సువర్ణాధ్యాయమని చెప్పారు.





## నోటీసులకు స్పందించని అమెరికా..

### రాయితీలకు కోత విధించే యోచనలో భారత్

**ఇంటర్నెట్ డెస్క్:**
అమెరికాకు చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నామన్న విషయాన్ని భారత్ ఇటీవల ప్రపంచ వ్యాణిజ్యసంస్థకు వెల్లడించింది. ముఖ్యంగా భారత స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ప్రపంచ వాణిజ్యసంస్థ ద్వారా అమెరికాకు నోటీసులు ఇప్పించింది. కాగా ఆ నోటీసులను అగ్రరాజ్యం తిరస్కరించింది. బహుపాక్షిక వాణిజ్య నియమాలకు అనుగుణంగా లేదని పేర్కొంది. ఉక్కు, అల్యూమినియంపై తమ సుంకాలు భారత్ పేర్కొన్నట్లుగా 'భద్రతా చర్యలు' కాదని, జాతీయ భద్రతా పరిగణనలపై ఆధారపడి ఉన్నాయని తెలిపింది. ఈ విషయంపై న్యూఢిల్లీతో ఎటువంటి చర్చలు నిర్వహించబోమని ట్రంప్ యంత్రాంగంలోని అధికారులు వెల్లడించారు.
దీంతో దామాషా ప్రకారం అమెరికా దిగుమతులకు ఇస్తున్న రాయితీలను తొలగించాలని భారత్ భావిస్తోంది. అమెరికా నుంచి వచ్చే లోహాలపై అధిక సుంకాలు విధించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై భారీఎత్తున టారిఫ్‌లు విధించారు. భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు తొలుత ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ఈ సుంకాలను జూన్ 4 నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. దీనివల్ల 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుంది. దీంతో అగ్రరాజ్యం రక్షణాత్మక వైఖరిని అవలంభిస్తోందని తప్పుబడుతూ భారత్ ప్రపంచ వ్యాణిజ్యసంస్థను ఆశ్రయించింది.
సరికొత్త వాణిజ్య ఒప్పందానికి న్యూఢిల్లీ – వాషింగ్టన్ అత్యంత సమీపంలోకి వచ్చినట్లు వార్తలొస్తున్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.
అమెరికాకు వాణిజ్యలోటును తగ్గించేందుకు భారత్ చాలా రాయితీలను ఈ డీల్ ద్వారా ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. కాగా ప్రస్తుతం అగ్రరాజ్యం అనుసరిస్తున్న చర్యలతో ఆ రాయితీలకు కోతలు విధించే అవకాశం ఉంది.

## అత్యాచార కేసులో దోషికి జీవిత ఖైదు.. డీఎంకే- అన్నాడీఎంకే మధ్య మాటల యుద్ధం

**ఇంటర్నెట్ డెస్క్: , స్టార్ త్రినేత్రం:**
అన్నా యూనివర్సిటీలో యువతిపై అత్యాచారానికి పాల్పడిన జ్ఞానశేఖర్‌కు జీవిత ఖైదు విధిస్తూ చెన్నైలోని మహిళా న్యాయస్థానం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుతో తమిళనాడు అధికార పార్టీ డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేరంలో మిగిలిన వారిని కాపాడేందుకే దర్యాప్తు వేగవంతంగా ముగించారంటూ అన్నాడీఎంకే ఆరోపించింది.
"19 ఏళ్ల యువతిపై విశ్వవిద్యాలయంలో దారుణం జరిగింది. ఈ నేరంలో ఇతరుల ప్రమేయం కూడా ఉంది. మిగిలిన వారిని కాపాడేందుకు డీఎంకే ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేసింది. ప్రజా ఉద్యమం వల్లే ఒక నేరస్థుడికి శిక్ష పడింది. కానీ జ్ఞానశేఖర్ మాత్రమే దోషి అని చెబుతూ ప్రభుత్వం ఎందుకు ఈ కేసు దర్యాప్తును వేగవంతంగా ముగించింది..?మిగిలిన వారిని ఎవరు కాపాడారు..?అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అన్ని వాస్తవాలు వెలుగు చూస్తాయి" అని అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం ఈ. పళనిస్వామి అన్నారు.
ఆయన వ్యాఖ్యలపై సీఎం ఎమ్‌కే స్టాలిన్ స్పందించారు. పళనిస్వామి చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. "ఈ ఘటన తర్వాత రాష్ట్ర పోలీసు బృందం వెంటనే స్పందించింది. నేరస్థుడిని పట్టుకునేందుకు కృషి చేసింది. ఐదు నెలల్లో న్యాయంగా పని చేసింది. నేడు దోషికి కఠిన శిక్ష పడింది. ఈ దర్యాప్తుపై న్యాయ స్థానాల నుంచి ప్రశంసలు అందాయి. మహిళల భద్రత పట్ల ఆందోళన చెందుతున్నట్లు నటించే వారి నోటిని పోలీసులు మూయించారు" అని గట్టి బదులిచ్చారు. కాగా.. అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని గతేడాది డిసెంబరు 23న రాత్రి తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం తనపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెను ఫొటోలు తీసి, తమపై ఫిర్యాదు చేస్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ కేసులో దోషిగా తేలిన జ్ఞానశేఖర్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది.






## దేశంలో 4 వేలకు చేరువైన కొవిడ్ కేసులు

**ఇంటర్నెట్ డెస్క్:**
దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్ 2న ఉదయం 8 గంటల వరకు దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,900 మార్కును దాటి.. నాలుగు వేలకు చేరువలో ఉంది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్‌లలో కూడా కేసులు గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేరళ, కర్ణాటకలో ఈ ఇన్ఫెక్షన్‌తో తాజాగా రెండు మరణాలు సంభవించినట్లు తెలిపారు. దీంతో 2025 జనవరి నుంచి దేశంలో కొవిడ్ మరణాల సంఖ్య 32కి చేరుకుంది. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 2,188 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయినట్లు పేర్కొన్నారు.కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. 24 గంటల్లో 360 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయన్నారు. కాగా దేశంలో పెరుగుతున్న కొవిడ్ కేసులపై ఇటీవల ప్రపంచ ఆరోగ్యసంస్థ (%ఔెనూ%) స్పందిస్తూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందన్న సూచనలు ఏమీ లేవని పేర్కొంది. ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ వేరియంట్ లక్షణాలు, ప్రభావాన్ని కట్టడి చేయడంలో సమర్థంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు తెలిపింది.

**రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..**
డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,961గా ఉండగా, కేరళలో అత్యధికంగా 1,435 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 506 యాక్టివ్ కేసులు ఉండగా.. ఏడుగురు మరణించారు. ఢిల్లీలో 483, పశ్చిమబెంగాల్‌లో 339, గుజరాత్‌లో 338, తమిళనాడులో 199, ఉత్తరప్రదేశ్‌లలో 149, ఒడిశా 12, గురుగ్రామ్ 12, పంజాబ్ 6లో కేసులు నమోదయ్యాయి.



## తెలంగాణ రాజ్‌భవన్‌లో తేనీటి విందు..

### హాజరైన సీఎం రేవంత్, మిస్‌వరల్డ్ సుచాత

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఏర్పాటు చేశారు.






**హైదరాబాద్, స్టార్ త్రినేత్రం:**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీఎస్, డీజీపీ, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, నిర్మాత దిల్‌రాజు దంపతులు హాజరయ్యారు. వీరితోపాటు తాజాగా మిస్‌వరల్డ్‌గా ఎంపికైన థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత, మొదటి రన్నరప్ హాసెట్ డెరెజే(ఇథియోపియా), రెండో రన్నరప్ మయా క్లైడా(పోలాండ్), మూడో రన్నరప్ ఆరేలి జోచిమ్(మార్టినిక్) కూడా గవర్నర్ తేనీటి విందులో పాల్గొన్నారు. రాజ్‌భవన్‌ను సందర్శించి.. గవర్నర్‌ను కలిశారు. మిస్ వరల్డ్ కిరీటం గెలిచిన సుచాతను గవర్నర్ సన్మానించారు.
ఈ సందర్భంగా ప్రపంచ సుందరీమణులతో గవర్నర్ ముచ్చటించారు.. "తెలంగాణ ప్రాంతాలు వికసిత్ భారత్‌ను సూచిస్తాయి. మీరు వెళ్లాక తెలంగాణ గురించి చెప్పడానికి చాలా విషయాలుంటాయి"అని అన్నారు. తెలంగాణ ఆతిథ్యంపై మిస్‌వరల్డ్ సుచాత స్పందిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు బాగున్నాయన్నారు. తెలంగాణ ఎప్పటికీ తన మనసులో నిలిచిపోతుందని చెప్పారు.

# సిద్దిపేటలో గో వధను అడ్డుకున్న హిందువులపై దాడి

తీవ్రంగా మండిపడిన హిందూ సంఘాలు    బంద్‌కు విశేష స్పందన



**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట:**

సిద్దిపేటలో గో వధను అడ్డుకోవడానికి ప్రయత్నించిన హిందువులపై ఆదివారం జరిగిన దాడి తీవ్ర దుమారాన్ని రేపుతోంది. విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలపై విచక్షణ రహితంగా దాడి చేసిన ముస్లింలపై వ్యతిరేకంగా హిందూ సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపాయి. ఈ ఘటనకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్ మరియు భజరంగ్ దళ్ సంయుక్తంగా సోమవారం సిద్దిపేట బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ సందర్భంగా హిందూ యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. శాంతియుత ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు, నినాదాలతో పట్టణం ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. వ్యాపార సంస్థలు,




దుకాణాలు, విద్యా సంస్థలు అన్ని మూతపడ్డాయి. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలపడం గమనార్హం. దాడికి నిరసనగా వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు మాట్లాడుతూ.. “గోమాతను రక్షించేందుకు ప్రయత్నించిన హిందువులపై దాడి చేయడం పూర్తిగా అసంఘికం. ఇది కేవలం ఒక మతంపై భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాలపై జరిగిన దాడి” అని విశ్వహిందు పరిషత్ కార్యకర్తలు పేర్కొన్నారు. దాడిలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గో వధలను పూర్తిగా నిలిపివేయాలని, గో రక్షకులకు రక్షణ కల్పించాలంటూ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తున్నారు.

**ప్రశాంతంగా ముగిసిన బంద్.. పోలీసులు అప్రమత్తం**

బంద్ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో వాదనలు, చిన్న చిన్న గుంపులు ఏర్పడినప్పటికీ, సమయానుగుణంగా పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాయపడిన వారిని ఎంపి రఘునందన్ రావు పరామర్శించారు. ఈ ఘటనపై రఘునందన్ రావు మాట్లాడుతూ.. హిందువులపై దాడి చెయ్యడం సరైన పద్ధతి కాదు అని అన్నారు. గాయపడిన వారికి అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు. అలాగే దాడి చేసిన వారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. పోలీసులు కూడా కార్యకర్తలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## హయత్ నగర్ లో ఘనంగా యుక్త ప్లైవుడ్ అండ్ హార్డ్ వేర్ షాప్ ప్రారంభం

**స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:**

హయత్ నగర్ సంగం బేకరీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన యుక్త ప్లైవుడ్ అండ్ హార్డ్ వేర్ షాప్ ను నిర్వాహకులు సింగిరెడ్డి నిఖిల్ రెడ్డి, పన్నాల శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఈ రంగంలో ఉన్న అనుభవంతో హయత్ నగర్ లో షాపు ఏర్పాటు చేశామన్నారు. తమ వద్ద అన్ని కంపెనీల ప్లైవుడ్, హార్డ్ వేర్, లామినేట్స్, వెనీర్, డోర్ల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తమ వద్ద అందుబాటులో ధరలు ఉన్నాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.



## జెడ్పిహెచ్ఎస్ (బాయ్స్) కొండపాకలో వైభవంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**స్టార్ త్రినేత్రం:**

సిద్ధిపేట, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపెట లోని కొండపాకలో జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఈరోజు తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రాంగణం తెలుగుతనాన్ని ప్రతిబింబించే రంగులతో కళకళలాడింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక గ్రామా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సముద్రాల శ్రీనివాస్ గారు అధ్యక్షత వహించారు. ఆయన తన ప్రసంగంలో తెలంగాణ ఉద్యమ గాథను, రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న పోరాటాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులు నృత్యాలు, పాటలు, వక్తృత్వాలతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ అలరించారు. ఈ వేడుకలు పాఠశాల స్థాయిలో తెలంగాణ గర్వాన్ని గుర్తుచేస్తూ, విద్యారంగంలోని సామూహిక చైతన్యాన్ని గణనీయంగా పెంపొందించాయి. స్థానికంగా ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది.





## దుబ్బాక ఏరియా ఆసుపత్రిలో ఘనంగా తెలంగాణా ఆవిర్భావ వేడుకలు. ముఖ్య అతిథిగా దుబ్బాక శాసన సభ్యులు

**స్టార్ త్రినేత్రం:**

సిద్ధిపేట, జిల్లాలోని దుబ్బాక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఆసుపత్రి సుపరెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదకొండు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణా రాష్ట్ర గొప్పదనాని వివరిస్తూనే తెలంగాణా ప్రజలందరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగ స్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. అసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలనను కాపాడుతూ, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని తెలిపారు. అసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ హేమరాజ్ సింగ్ పేర్కొన్నారు.




## సిద్ధివినాయక నగర్‌లో దొంగల బీభత్సం రెండు ఇళ్లలో చోరీ



**సిద్ధిపేట,స్టార్ త్రినేత్రం:**

సిద్ధిపేట మండలం బుర్గుపల్లి గ్రామంలోని సిద్ధివినాయక నగర్ కాలనీలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు అని కాలని వాసులు తెలిపారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, దొంగలు అర్ధ రాత్రి సమయంలో అందరు పడుకున్న తర్వత కాలని వెనకనుండి వచ్చినారు ఒక ఇంట్లో ఎవ్వరూ లేరని నిర్ధారించుకొని ఆ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించడం జరిగింది ఆ ఇల్లు కాలిగా ఉండడంతో మరో ఇంటి కిటికీ తలుపు తిసి జాలి కత్తిరించి కిటికిలోంచి చూడగా అక్కడ సెల్ ఫోన్ ఉన్నది వెంటనే ఆ ల్ ఫోన్ ను దొంగిలించడం జరిగింది. ఇదిలా ఉండగా మరో రెండు ఇళ్ళలో తలుపులు తియ్యడానికి కూడా ప్రయత్నించడం జరిగింది.

చోరీ జరిగిన సమయంలో పక్కింటి నివాసితులకు ఎటువంటి అనుమానం రాకుండా దొంగలు జాగ్రత్తగా పడ్డారు. స్థానికులు తెల్లవారుజామున ఇళ్ల తాళాలు పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సిద్ధివినాయక నగర్ కలని ప్రెసిడెంట్ బండగారి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సిద్ధిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు. నగరంలో ఇటీవలి కాలంలో పెరిగిన చోరీల నేపథ్యంలో ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజలు రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా చల్ల నరసింహారెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు.

రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బర్రె రాజ్ కుమార్ మాట్లాడు తూ అమరుల ఆశయ సాధన కోసం ఎందరో అమరుల త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని అన్నారు.ప్రతిఒక్కరు తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో పునరంకితమవ్వాలని అన్నారు.ఎందరో అమరవీరుల ప్రాణత్యాగాల స్ఫూర్తితో 60 ఏళ్ల నాటి కల సాకారం నేడు మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. నాలుగుకోట్ల ప్రజల ఆకాంక్ష, 60 ఏండ్ల ఆరాటం ప్రజల అస్తిత్వపు ఆత్మగౌరవ పోరాటం ఈ తెలంగాణ అని అన్నారు. మహనీయుల ఆశయాలతో ఆశయ సిద్ధికై అమరవీరుల ఆత్మార్పణ ఫలితంగా అవతరించిన నేల అని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశల వారీగా అమలావుతున్నాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అమరవీరులను ఉద్యమకారులను మర్చిపోయిందని కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిందన్నారు.

## వేములవాడ పట్టణ బి జె పి ఆధ్వర్యంలోఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**స్టార్ త్రినేత్రం, వేములవాడ:**

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కల నెరవేరిన రోజు తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఈరోజు భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాలాపన గావించి సంబరాలు జరుపుకోవడం జరిగింది

## సిద్దిపేటలో ఘనంగా తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**స్టార్ త్రినేత్రం:**

సిద్ధిపేట, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సిద్ధిపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

మంత్రులు, అధికారులు కలిసి జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా, మంత్రి పొన్నం ప్రభాకర్ జండా ఆవిష్కరణ చేసారు, అనంతరం అయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదావరి నదీ జలాలు సిద్దిపేటకు చేరుకోవడం తెలంగాణ ప్రజల కలను నిజం చేసిన ఘట్టమని ఆయన పేర్కొన్నారు.అధికారిక వేడుకల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు, కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినాన్ని సంతోషంగా జరుపుకున్నారు.




## రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

### అబ్దుల్లాపూర్మెట్ తహాశీల్దార్ సుదర్శన్ రెడ్డి .. నేడు అబ్దుల్లాపూర్మెట్ లో రెవెన్యూ సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్:**

భూ భారతి చట్టం అమలులో భాగంగా నేటి నుండి ఈనెల 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అబ్దుల్లాపూర్మెట్ తహాశీల్దార్ సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల యందు ఏమైనా తప్పులు ఉన్నా, లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల యందు పేర్లు నమోదు కాకపోయినా, మరి ఇతర ఏ రకమైన భూ సమస్యలు ఉన్నా నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.నేడు అబ్దుల్లాపూర్మెట్, 4న బండ రావిర్యాల, అక్బర్ జా, చిన్న రావిర్యాల, 5న తట్టి అన్నారం, తట్టిఖానా, మర్రిపల్లి, 6న కుంట్లూరు, హాతిగూడ, 9న పసమాముల, పోచంపల్లి వాడ, తారామతి పేట్, 10న బాచారం, దయారా, గౌరెల్లి, 11న కవాడిపల్లి, బలిజగూడ, 12న కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ, 13న తుర్కయంజాల్, మన్నెగూడ, 16న అనాజ్ పూర్, ఉమరా?న్ దయారా, 18న తొర్రూర్, మునగనూరు, 19న లష్కర్ గూడ, సుర్మాయి గూడ, సాగర్ పంప్, ఇనాంగూడ, 20న మజీద్ పూర్ ,గుంతపల్లి, 21న కోహెడ, గండి చెరువు, 23న బాటసింగారం, పిగ్లీపూర్, 24న పెద్ద అంబర్పేట్, ఇంజాపూర్ లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహాశీల్దార్ సుదర్శన్ రెడ్డి తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.






## సిద్దిపేటలో గో రక్షకులపై చేసిన దాడికి నిరసనగా ఈరోజు సిద్దిపేట బంద్ కి పిలుపునిచ్చిన వి హెచ్ పి.

**స్టార్ త్రినేత్రం:**

సిద్దిపేట, సిద్దిపేటలో గో రక్షకులపై జరిగిన దాడికి నిరసనగా ఈ రోజు సచ్చంద బంద్ కి విశ్వ హిందు పరిషత్ పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్ లో సిద్దిపేట పట్టణంలోని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరడం జరిగింది.

## రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి : చౌటుప్పల్ తహాశీల్దార్ బి. వీరాబాయి

**స్టార్ త్రినేత్రం, చౌటుప్పల్:**

భూ భారతి చట్టం అమలులో భాగంగా నేటి నుండి ఈనెల 16వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చౌటుప్పల్ తహాశీల్దార్ బి. వీరాబాయి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల యందు ఏమైనా తప్పులు ఉన్నా, లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల యందు పేర్లు నమోదు కాకపోయినా, మరి ఇతర ఏ రకమైన భూ సమస్యలు ఉన్నా నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## ఉద్యమ వీరుకలు కోటి పురస్కారం

**పాశం యాదగిరి తదితరులకు అందచేత**

హైదరాబాద్,జూన్2 స్టార్ త్రినేత్రం : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తొమ్మిది మందికి రూ.కోటి నగదును సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఉద్యమ సమయంలో ప్రజల గుండెల్లో నిలిచిన కవులు, కళాకారులు సాహితీవేత్తలకు నగదు పురస్కారం అందిస్తామని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో సీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, జయరాజు, పాశం యాదగిరికి నగదు పురస్కారాన్ని అందించారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి తరఫున వారి కుటు-ంబసభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరఫున ఆయన కుమార్తె పురస్కారాన్ని స్వీకరించారు.

## గన్పార్క్ వద్ద సిఎం రేవంత్ నివాళి

**ముఖ్య అతిథిగా జపాన్ కితాక్యూషూ సిటీ మేయర్ కజుహిసా టకేచీ**

హైదరాబాద్,జూన్2 స్టార్ త్రినేత్రం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్ లో అమరవీరుల స్థూపం దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. అవతరణదినోత్సవానికి వెళ్లే ముందు ఆయన నేరుగా గన్‌పార్క్ వెళ్లి స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, సిపిఐ నేత నారాయణ తదితరులు పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జపాన్ లోని కితాక్యూషూ సిటీ మేయర్ కజుహిసా టకేచీ, ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీసు అధికారులకు మెడల్ ఫర్ గ్యాలెంట్రీ-, 11 మంది కి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించారు. బహు భాషా సాహితీ వేత్త నలిమెల భాస్కర్ కు కాళోజీ పురస్కారం అందించారు.

## తెలంగాణ..కోటి రతనాల వీణ

**శుభాకాంక్షలు తెలిపిన పవన్ కళ్యాణ్**

అమరావతి,జూన్2 స్టార్ త్రినేత్రం : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. తనలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల తెలంగాణ అని పేర్కొన్నారు. జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల.. నాకు పునర్జన్మను ఇచ్చిన నేల.. నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ అన్నారు. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలతో పాటు- దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి,ప్రధాని, అమిత్ షా, చంద్రబాబు

న్యూఢిల్లీ,జూన్2 స్టార్ త్రినేత్రం : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తోంది. ఈ రాష్ట్రం శక్తిమంతమైన పర్యావరణ వ్యవస్థ కలిగి ఉంది. తెలంగాణ ప్రజలు పురోగతిలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ పురోగతికి లెక్కలేనంత కృషి చేసేలా తెలంగాణ ప్రసిద్ధి చెందింది. గత దశాబ్ద కాలంలో రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. తెలంగాణ ప్రజల మెరుగైన జీవన సౌలభ్యానికి కేంద్రం కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. రాష్ట్ర అభివృద్ధిలో కొత్త శిఖరాలను చేరుకోవాలని కోరుకుంటున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. గొప్ప సంస్కృతి, కష్టపడి పనిచేసే ప్రజలతో తెలంగాణ ప్రకాశిస్తోందని షా అన్నారు. తెలుగు రాష్ట్రాలు వేరైనా.. తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన, ఆకాంక్ష. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్న తెలంగాణ ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై చర్చిద్దామా

**హరీష్ రావుకు పిసిసి చీఫ్ సవాల్**

హైదరాబాద్,జూన్2 స్టార్ త్రినేత్రం : బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు రావాలని మాజీ మంత్రి హరీష్ రావును టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని హరీష్ రావును ఉద్దేశించి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించలేదు అనే మాట నిజమా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులు విలువ తగ్గించిన విధానాన్ని కంచె చేను మేసినట్లుగా ఉందని అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అలాగే, హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ భేటీ- అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేస్తూ, ఈ సమావేశంపై మా వద్ద స్పష్టమైన సమాచారం ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఉందన్న అభియోగాలపై స్పష్టత కోరుతూ, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు ముందు హరీష్ రావు సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గౌడ్ ఘాటు విమర్శలు చేశారు. రూ. 1.20 లక్షల కోట్లను ఖర్చు పెట్టిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరానికి అయినా నీరు వచ్చిందా? అని ప్రశ్నిస్తూ, కాళేశ్వరం కూళేశ్వరం అయిందని అంటూ ఎద్దేవా చేశారు. అంతేకాక, హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై సె-టైర్లు వేస్తూ - 'నాలుగు ముక్కలాటలో ఏ పార్టీ తరఫున పోటీ- చేస్తావ్ హరీశ్ రావూ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య నడుస్తున్న రాజకీయ నాటకాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## రోజుకు రెండు వందల ఇళ్ల నిర్మాణం

**లే ఔట్లను ఇంజనీర్లు ఖచ్చితంగా పరిశీలించాలి**

**అధికారులును ఆదేశించిన మంత్రి కొలుసు పార్థసారధి**

అమరావతి,జూన్2 స్టార్ త్రినేత్రం :రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గృహాలను ప్రతీ రోజు రెండు వందలు గృహాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులును ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణం లో ఉన్న గృహాలు, ఇతర అంశాలు పై సోమవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులుతో సుదీర్ఘంగా సమీక్షా నిర్వహించారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజేయ్ జైన్, గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు పాల్గొన్నారు. గృహనిర్మాణ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు ప్రతీ రోజు కచ్చితంగా లేఔట్ లను సందర్శించి గృహాలను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని, ఎక్కడైతే సచివాలయం కు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు- సహకరించక పోతే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకొని వెళ్లాలని మంత్రి సూచించారు. నిర్మాణ సామాగ్రి లబ్ధిదారులకు అందుబాటు-లో ఉంచాలని, నిర్మాణ సామాగ్రిని సమీకరించటానికి అసిస్టెంట్ ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పూర్తి కానీ గృహాల నిర్మాణాల దగ్గర గృహనిర్మాణ శాఖ సిబ్బందికి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మధ్య సమన్వయం ఉండాలని, జిల్లా అధికారులు అందరు నిర్మాణాల పురోగతి పై నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి తెలియచేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలను 2026సంవత్సరం మార్చి నాటికి పూర్తి చేయాలని, దానికి అనుగుణంగా అధికారులు సిబ్బంది పనిచేయాలని మంత్రి పార్ధ సారధి ఆదేశించారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజేయ్ జైన్ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న గృహాల పురోగతిని వివరించారు.

## బనకచర్లపై వేగం పెంచి ఎపి ప్రభుత్వం

**కేంద్రానికి ప్రతిపాదనలు అందచేత**

అమరావతి,జూన్2 స్టార్ త్రినేత్రం : 'పోలవరం - బనకచర్ల' ప్రాజెక్టుపై ఎపి ప్రభుత్వం వేగం పెంచింది. ఓ వైపు తెలంగాన నుంచి విమర్శలువస్తున్న వేళ మరింత చురుకుగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో కేంద్రం ముందుకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకెళ్లింది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు ప్రాజెక్టు పూర్తి వివరాలు అందించారు. సుమారు రెండు గంటలపాటు సాగిన సమావేశంలో.. ఈ ప్రాజెక్టు వల్ల రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శికి రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి, నీటిపారుదలశాఖ అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రూ.81 వేల కోట్లతో ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. గత నెలలో జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. భవిష్యత్‌లో స్వీయ ఆర్థిక ప్రాజెక్టుగా ఉంటుందని ఏపీ అధికారులు వివరించారు. మరోవైపు తెలంగాణ అభ్యంతరాలపైనా ఏపీ సమాధానం ఇచ్చింది.

# విద్యారంగ పటిష్టత.. నీటిమీద రాతలు !



ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వ విద్యారంగం పటిష్టత పేరుతో ఏళ్లుగా కబుర్లు చెప్పి కాలయాపన చేస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు తీర్చాల్సిందే. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం గతంలో చేసిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కెజి టూ పిజి అన్న ప్రతిపాదన కోల్డ్ స్టోరేజీకి వెళ్లింది. స్కూళ్లకు సరైన వసతులు ఉండవు. టీచర్ల సంగతి సరేసరి. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. ఏటా కనిపిస్తున్న దృశ్యాలే ఇవి. ఇకపోతే జూన్ మాసం వచ్చిందంటే తల్లిదండ్రులు గుండోల్లో దడ పట్టుకుంటుంది. పిల్లకు స్కూళ్లు తెరిచేనాటికి ఫీజులు, పుస్తకాలు, షూస్ ఇలా రకరకాల ఖర్చులు తడిసిమోపెడు అవుతుంటాయి. ప్రభుత్వ స్కూళ్లలో భరోసా లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు అప్పుల చేసి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. అందుకే ఏటా పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబ సభ్యులకు జూన్ నెల భయం పట్టుకుంటుంది. భరించలేని ఫీజుల భారాలు, పుస్తకాలు, యూనిఫాం ఖర్చులన్నీ ఒకే సారి వస్తాయి. నోట్ల కట్టలను కట్టగట్టి పిల్లలను పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరుస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాయని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లుమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. కొత్త ఏడాది పిల్లల్ని పాఠశాలలకు పంపాలంటే ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.50వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. హైదరాబాద్ లాంటి నగరంలో పిల్లవాడికి కనీసం 2 నుంచి 3 లక్షల వరకు ఖర్చు అవుతోంది. యూనిఫామ్, పుస్తకాలు, తదితరాలు మళ్లీ అదనమని గుర్తించాలి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్య,వైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని గత ప్రభుత్వం ప్రయత్నించి విఫలమయ్యింది. తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా అన్న చర్చ సాగింది. అదీలేదు...ఇదీ లేదన్నట్లుగా రెంటికి చెడ్డ రేవడిలా విద్యారంగం తయారయ్యింది. ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై నియంత్రణ లేకుండా పోయింది. ప్రభుత్వ స్కూళ్లు బలపడితే ప్రైవేట్ దోపిడీ తగ్గుతుందన్న కనీస జ్ఞానం లేకుండా పాలకులు ఉన్నారు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అన్న మౌలిక ప్రశ్నలు వచ్చాయి. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? అన్న వారు ఏ పనీ చేయకుండానే పోయారు. నిజానికి ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. అయితే ఇంగ్లీష్ మీడియం ప్రకటించడానికి ముందు ఆ మేరకు స్కూళ్లను, తయారు చేసి టీచర్లను నియమించాల్సి ఉంది. ప్రకటనలు బాగున్నా ఆచరణలో పక్కా ప్రణాళిక ఉండాలి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. నిపుణులు మాతృభాషా బోధనే మేలంటున్నారు. ఇంగ్లీష్ నేర్పడం వేరు. బోధన వేరని అభిప్రాయంగా ఉంది. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాష లోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చుకోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్,హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. తెలుగే అర్థం కాక వారి తెగల భాషలో వాలంటీర్లు అనువాదం చేస్తే తప్ప గిరిజన పిల్లలు స్కూలుకు రాని పరిస్థితి వుంది. ఇక ఇంగ్లీషు రుద్దితే బడి మానేస్తారు తప్ప అద్భుతంగా రాణించలేరు. ఇంట్లో తెలుగు, ఊరిలో తెలుగు, సమాజమంతా తెలుగు వినిపిస్తోంది. పుట్టిన దగ్గర నుండి తెలుగు వింటూ, మాట్లాడు తుంటారు. కనుక తెలుగులో క్లిష్టమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోడానికి అవకాశం వుంది. ఇంగ్లీషు భాషలో అర్థం చేసుకోవడం కష్టం. ఇంగ్లీషు తెలియని ఇళ్ళు, సమాజం నుండి వివరణ అడిగి తెలుసుకునే అవకాశం తక్కువ. అందువలన ప్రాథమిక విద్యా స్థాయిలో... ఆంగ్ల మాధ్యమం లో విషయ పరిజ్ఞానం, జ్ఞాన సంపాదన కష్టం. పైగా పేదలు తమ పిల్లలకు డబ్బు పెట్టి ట్యూషన్‌కు పంపించలేరు. టీచర్లను పెట్టి చదివించుకోలేరు. అన్ని విధాలా పేదల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో నష్టపోవడం ఖాయం. దబున్న వాళ్లకు అన్ని అవకాశాలు వుంటాయి గనుక ఏ మాధ్యమ మైనా ఫర్వాలేదు. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా.. దేశంలో జాతీయోద్యమంగా సాగాలి.

# ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

**దోపిడీ సాగుతున్నా పట్టించుకోని వైనం**

**విజయవాడ,జూన్2 స్టార్ త్రినేత్రం :**

ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఏటా హామీలు తప్ప నియత్రణ జరగడం లేదు. దోపిడా సాగుతున్నా పట్టించుకోని వైనం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా తల్లికి వందనం అందలేదు. ఎంత మంది పిల్లల్ని చదివిస్తున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభం రోజు అంటే జూన్ 12న తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఇటీవలే ప్రకటించారు. దాని కోసం చాలా మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే సర్కార్ తోడ్పాటుతోనే పిల్లలను చదివించే అవకాశం కలుగుతుంది. ఒక్కో జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు లక్ష మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ లక్షల్లో ఫీజులుకట్టాల్సి ఉంది. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇవన్నీ తడిసి మోపెడు అవుతున్నాయి. ఈ ఫీజులను ఎలాగూ నియంత్రించ లేకపోతున్నారు. అందుకే ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురు చూస్తున్నారు. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే మారుతోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయా నికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో చదువు ఖరీదైనదిగా మారింది. గడిచిన దశాబ్ద కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజులను రెడీ చేసుకోవాల్సిందే. వారికి కనీసం సామాజిక బాధ్యత లేకుండా దోపిడీకి గురి చేస్తున్నారు. ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు-, కార్పొరేట్‌కు ధారబోస్తున్నారు. ప్రభుత్వం ఫీజులు నియంత్రించాలని కోరుతున్నా పాలకులు పట్టంచుకోవడం లేదు.

# యోగా మన ఘన వారసత్వ సంపద

- యోగాంధ్రలో రోజుకో కార్యక్రమం
- ప్రతి ఒక్కరినీ భాగస్వాములనే చేసే లక్ష్యం
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,జూన్2 స్టార్ త్రినేత్రం :**




యోగా మన ఘన వారసత్వ సంపద అని.. శారీరక ఆరోగ్యంతో పాటు- మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగాను ప్రతిఒక్కరూ తమ రోజువారీ టైమ్‌టేబుల్‌లో మొదటి అంశంగా చేసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా రోజూ ప్రత్యేక యోగాభ్యసన కార్యక్రమం చేపట్టి చైతన్యం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, యోగా ఔత్సాహికులతో కలిసి యోగాసనాలను అభ్యసిస్తున్నారని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని, ఇది దేశానికే గర్వకారణమన్నారు. రాష్ట్రం నలుమూలలకూ యోగా విశిష్టతను చేరువచేసేందుకు ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతమంచి కార్యక్రమంలో రోజూభాగస్వామ్యం కావడం ఆనందం కలిగిస్తోందన్నారు. మన ఆరోగ్య సంరక్షణకు రోజూ ఉదయం సూర్య నమస్కారాలు ఎలాగైతే చేస్తామో యోగాలో అది ఒక భాగమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామం, ప్రతి వార్డులోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇదే విధంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మొదటిగా గాంధీ హిల్‌పై నిర్వహించామని, ఇదేవిధంగా ఆదివారం పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. మనం చేసే ప్రతి పనిద్వారా మంచి ఫలితాలు రావడానికి, ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు యోగా ఉపయోగపడుతుందని అన్నారు. జూన్ 21 నాటికి మన జిల్లాలో కొత్తగా పది లక్షల మందికి యోగాను నేర్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయుష్ డిపార్టుమెంట్ 45 నిమిషాల కామన్‌యోగా ప్రోటోకాల్ ఆధారంగా యోగాను ప్రతి వర్గానికీ చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని.. ఇందుకు ప్రతిరోజు ఒక థీమ్ పెట్టుకొని యోగా అవగాహన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు- తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను ప్రాక్టీస్ చేసి, మరో పదిమందితో ప్రాక్టీస్ చేయించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# 5న కాళేశ్వరం విచారణకు హాజరు కాలేను

**11న వస్తానని సమాచారమిచ్చిన కెసిఆర్**

**హైదరాబాద్,జూన్2 స్టార్ త్రినేత్రం :**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కీలక నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం కమిషన్ ఎదురుగా విచారణకు ఈ నెల 5వ తేదీన హాజరు కావడం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 11వ తేదీన హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అయితే, విచారణకు మరింత సమయం కావాలని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ ను ఆయన కోరినట్లు తెలుస్తుంది. ఇప్పటికే, ఈ విషయాన్ని కాళేశ్వరం కమిషన్ కు సమాచారం అందజేశారు. గులాబీ బాస్ కోరిక ప్రకారం ఈ నెల 11వ తేదీన విచారణకు వచ్చేందుకు కాళేశ్వరం కమిషన్ అంగీకరించింది. అయితే, మరోవైపు, ఇవాళ తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు మీద చేపట్టిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కూడా వాయిదా వేశారు. ఈ నెల 9వ తేదీన కమిషన్ ముందు హాజరు కానున్నారు.. అలాగే, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ ముందు విచారణకు వెళ్లనున్నారు. ఇక, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై విచారణ కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా తుది దశకు చేరుకుంది. కాగా, ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు సీఎంగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులను ఇప్పటికే అందజేసింది.ఈనెల 5వ తేదీన విచారణకు రావాలని కాళేశ్వరం కమిషన్ ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఈ విచారణకు మరింత సమయం కావాలని కమిషన్ ఛైర్మన్‌ను కేసీఆర్ కోరినట్లు- సమాచారం. కాళేశ్వరం కమిషన్ ముందు హాజరుకావడంపై ఆయన సుదీర్ఘ ఆలోచనలు చేస్తున్నట్లు- తెలుస్తోంది.హరీష్‌రావు హాజరు తర్వాత పరిణామాలను బేరీజు వేసుకుని ఈనెల 11న విచారణకు వెళ్లాలా, వద్దా? అనే విషయంపై కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు.



# 'హరిహర వీరమల్లు' ట్రైలర్.. నిర్మాత ఏమన్నారంటే!

పవన్ కల్యాణ్ (Pawan Kalyan) కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు' (Hari Hara Veera Mallu). క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జూన్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. దీంతో నిర్మాత ప్రచారం జోష్ పెంచారు. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ఎప్పుడనే దాని గురించి మాట్లాడారు.

"దీని ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే రెండోభాగంలో సీజీ వర్క్ చాలా ఎక్కువగా ఉంది. దీంతో ఆలస్యమైంది. ప్రస్తుతం దీని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆ పనులు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత ట్రైలర్‌ను విడుదల చేస్తాం. దీని విడుదల తేదీని కూడా ఆ పనులన్నింటినీ దృష్టిలోపెట్టుకొనే ప్రకటించాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు సమయం పడుతుంది' అని ఏఎం రత్నం తెలిపారు.

ఇక ఈ సినిమాను తెరకెక్కించడానికి ప్రధాన కారణం క్రిష్ అని నిర్మాత తెలిపారు. "క్రిష్ స్థానంలోకి మా అబ్బాయి (జ్యోతికృష్ణ) రావడం అనుకోకుండా జరిగింది. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు ఎంతో చేశారు. ఈ సినిమా లైన్ చెప్పింది క్రిష్. అది నాకు చాలా బాగా నచ్చింది. దీన్ని పవన్ కల్యాణ్ చేస్తేనే బాగుంటుందని ఆయన చెప్పారు. ఆ తర్వాత కొవిడ్ వచ్చింది. దీంతో ఆలస్యమైంది. ఆయనకు వేరే సినిమాల కమిట్‌మెంట్‌లు ఉండడంతో దీన్ని జ్యోతికృష్ణకు అప్పగించారు" అని చెప్పారు.

# నా వ్యాఖ్యలు.. అలా అర్థం చేసుకోవడం మీ ఖర్మ

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ నటించిన తాజా చిత్రం 'షష్టిపూర్తి'. 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత ఆయన, అర్చన ప్రధాన పాత్రల్లో ఈ చిత్రంలో నటించారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మే 30న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా ఈ టీమ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. అందులో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ సరదాగా ఉంటానని అన్నారు

''ఇళయరాజా పుట్టినరోజు నాడు ఈ సినిమా సక్సెస్ మీట్ నిర్వహించడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆయనకు నేనంటే ఎంతో అభిమానం, ప్రేమ. ఈ మధ్య కొన్ని కార్యక్రమాల్లో నేను మాట్లాడిన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. అది మీ సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. వాటిని తప్పుగా అర్థం చేసుకోవడం మీ ఖర్మ. నేనైతే ఇలానే ఎప్పుడూ సరదాగానే ఉంటాను. మీడియాను నా కుటుంబంగా భావిస్తాను. నన్ను మీరంతా అన్నయ్య అని పిలవడం నా అదృష్టం''

''ఈ మధ్య ఓ కార్యక్రమంలో నేను పరిచయం చేసిన హీరోయిన్, యాక్టర్ గురించి సరదాగా మాట్లాడాను. వాటిని తప్పుగా అనుకున్నారు. నేను ఇలానే ఉంటాను. ఎందుకంటే అన్నయ్యను కాబట్టి. ఇండస్ట్రీలో ఏ నటుడికి దక్కని అవకాశం నాకు దక్కింది. పెళ్లి (పెళ్లిపుస్తకం) నుంచి షష్టిపూర్తి వరకూ కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా నడిచింది. మీ అందరూ ఈ సినిమాను అదరించినందుకు ధన్యవాదాలు. మనం నటించే సినిమాల్లో మనం కనిపించకూడదు.. పాత్రలే కనిపించాలి. నాతో వర్క్ చేసిన నటీనటులంతా నాతో సరదాగానే ఉంటారు. అందులో తప్పేం లేదు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు.




'నాకు తెలిసిన విషయాలను పక్కవారికి చెబుతాను. ఈ సినిమాలో నటీనటులకు కొన్ని సన్నివేశాలు వివరించాను. కొత్త ఆర్టిస్టులకు, నాకు తేడా ఏమీ ఉండదు. కాకపోతే వారికంటే నాకు కాస్త అనుభవం ఎక్కువంతే. నాకు ఎన్నో భిన్నమైన పాత్రల్లో నటించే అవకాశం వచ్చింది. అది దేవుడిచ్చిన వరం. నిజ జీవితంలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటామో.. సినిమాల్లోని పాత్రల్లో వచ్చే వాటిని కూడా ఎదుర్కోవాలి. అది ఆర్టిస్టుల బాధ్యత. షష్టిపూర్తిలో నా బాధ్యతను నిర్వర్తించాను. మీరంతా ఆదరించారు. ఇలాంటి పాత్రలే చివరి శ్వాస వరకూ చేయాలని కోరుకుంటాను. నాపై అభిమానం చూపుతున్న అందరికీ పాదాభివందనం'' అని తెలిపారు.



# మరో హారర్ చిత్రంలో నుస్రత్?

'సింగమ్', 'సూర్యవంశీ' లాంటి యాక్షన్ చిత్రాలతో మెప్పించిన బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇప్పుడాయన రూటు మార్చి ఓ హారర్ సినిమాతో ప్రేక్షకులను భయపెట్టడానికి సన్నద్ధమవుతున్నారు. రోహిత్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నాయిక నుస్రత్ భరుచా ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. "ప్రస్తుతం సినీప్రియులు ఎక్కువగా హారర్ సినిమాలపై ఆసక్తి చూపుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నుస్రత్‌తో ఓ హారర్ ప్రాజెక్టును సిద్ధం చేశారు రోహిత్ శెట్టి. దీనికి ఇ నివాస్ దర్శకత్వం వహించనున్నారు. ఈ ఏడాది ఆఖర్లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అతీంద్రియ శక్తులతో పోరాడుతూ ఓ స్త్రీ చుట్టూ తిరుగుతుంది. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని రోహిత్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇటీవలే 'ఛోరి 2'తో ప్రేక్షకుల్ని పలకరించింది నుస్రత్.





# వస్తోంది కొత్త ఛాంపియన్

పంజాబ్ కింగ్స్ సత్తా చాటింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (87 నాటౌట్; 41 బంతుల్లో 5×4, 8×6) చెలరేగిన వేళ ఆ జట్టు ఐపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం క్వాలిఫయర్ 2లో 5 వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించింది. మొదట ముంబయి 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. తిలక్ వర్మ (44; 29 బంతుల్లో 2×4, 2×6), సూర్యకుమార్ యాదవ్ (44; 26 బంతుల్లో 4×4, 3×6), బెయిర్‌స్టో (38; 24 బంతుల్లో 3×4, 2×6), నమన్ ధీర్ (37; 18 బంతుల్లో 7×4) సత్తా చాటారు. శ్రేయస్ అద్వితీయ పోరాటానికి నేహాల్ వధేరా (48; 29 బంతుల్లో 4×4, 2×6) సహకారం తోడు కావడంతో లక్ష్యాన్ని పంజాబ్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వర్షం వల్ల ఈ మ్యాచ్ ఆరంభం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది. ఓవర్లలో ఎలాంటి కోత పెట్టలేదు.

## శ్రేయస్ పోరాటం:

ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) త్వరగానే నిష్క్రమించినా ఛేదన ఆరభంలో పంజాబ్ విశ్వాసంతోనే సాగింది. ఇంగ్లిస్ (38; 21 బంతుల్లో 5×4, 2×6) చక్కని షాట్లతో అలరించాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదాడు. ప్రియాంశ్ ఆర్య (20) కూడా బ్యాట్ ఝుళిపించాడు. ఆరో ఓవర్లో అతడు నిష్క్రమించేటప్పటికి పంజాబ్ స్కోరు 55. ఎనిమిదో ఓవర్లో ఇంగ్లిస్ కూడా ఔటైనా.. శ్రేయస్, నేహాల్ వధేరా చక్కని బ్యాటింగ్‌తో పంజాబ్‌ను రేసులో నిలిపారు. ధాటైన బ్యాటింగ్‌తో సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో ఉంచారు. హార్దిక్ బౌలింగ్‌లో వధేరా సిక్స్, ఫోర్ బాదగా.. టాప్లీ ఓవర్లో శ్రేయస్ వరుసగా మూడు సిక్స్‌లు దంచేశాడు. 15 ఓవర్లకు 147/3తో పంజాబ్ గెలుపు పై కన్నేసింది. తర్వాతి ఓవర్లో వధేరా ఔటైనా, 17వ ఓవర్లో శశాంక్ రనౌటైనా శ్రేయస్ అదిరే బ్యాటింగ్‌ను కొనసాగించడంతో పంజాబ్ లక్ష్యం దిశగా సాగింది. 18వ ఓవర్లో బుమ్రా సూపర్ యార్కర్‌ను శ్రేయస్.. బౌండరీకి తరలించిన తీరు అద్భుతం. ఆఖరి రెండు ఓవర్లలో పంజాబ్‌కు 23 పరుగులు అవసరమయ్యాయి. కానీ కళ్లు చెదిరే బ్యాటింగ్‌ను కొనసాగించిన శ్రేయస్.. ఆరు బంతుల్లోనే పని పూర్తి చేశాడు. అశ్వని వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో నాలుగు సిక్స్‌లతో పంజాబ్‌ను విజయ తీరాలకు చేర్చాడు.

## ముంబయి ధనాధన్:

వర్ష వాతావరణంలో అంతకుముందు పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ముంబయి ఓపెనర్ బెయిర్‌స్టో మరోసారి అదరగొట్టాడు. పవర్‌ప్లే ముగిసేసరికి ముంబయి 65/1తో నిలిచింది. అయితే ఏడో ఓవర్లో ప్రమాదకర బెయిర్‌స్టోను ఔట్ చేయడం ద్వారా పంజాబ్‌కు వైశాఖ్ ఊరటనిచ్చాడు. కానీ తిలక్ వర్మ చక్కని షాట్లతో వైశాఖ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్.. చాహల్ ఓవర్లో సూర్యకుమార్ సిక్స్, ఫోర్ బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి ముంబయి 102/2తో బలమైన స్థితిలో నిలిచింది. బ్యాటర్ల మెరుపులు కొనసాగడంతో 14వ ఓవర్లో 142/2తో ముంబయి భారీ స్కోరుపై కన్నేసింది. కానీ పరిస్థితి ప్రమాదకరంగా మారిన దశలో అదే స్కోరు వద్ద జోరుమీదున్న ఆటగాళ్లిద్దరినీ ఔట్ చేసి ఊపిరిపీల్చుకుంది పంజాబ్. సూర్యను చాహల్, తిలక్‌ను జేమీసన్ వెనక్కి పంపారు. సూర్య, తిలక్ జంట మూడో వికెట్‌కు 42 బంతుల్లోనే 72 పరుగులు జోడించింది. అయితే నమన్ ధీర్ చెలరేగడంతో ఆఖరి అయిదు ఓవర్లలో ముంబయి 57 పరుగులు రాబట్టగలిగింది.

# ఎప్పటికప్పుడు నిరూపించుకోవాల్సిందే



ఓటములు ఆటలో భాగమని కానీ అత్యుత్తమం అని ఎప్పటికప్పుడు నిరూపించుకోవాల్సి ఉంటుందని అని రెండుసార్లు ర్యాపిడ్ ప్రపంచ ఛాంపియన్ కోనేరు హంపి చెప్పింది. "ఓటమిని ఒప్పుకోని తత్వం.. అత్యుత్తమం అని నిరూపించుకోవాలన్న తపన వల్లే నేను ఇంకా చెస్‌లో కొనసాగుతున్నా. పోరాట స్ఫూర్తి చాలా ముఖ్యం" అని హంపి తెలిపింది. నార్వే చెస్ టోర్నీలో ఆడుతున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. "క్లాసికల్ రేటింగ్‌ను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించా. గతేడాది రేటింగ్‌తో పాటు ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డా. గత రెండు గ్రాండ్‌ప్రి టోర్నీలో మెరుగైన ప్రదర్శనతో రేటింగ్‌లో పుంజుకున్నా. నార్వే చెస్‌లో సత్తా చాటడం ద్వారా ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకోవాలనుకుంటున్నా. ఎప్పటికప్పుడు నిరూపించుకోవాల్సిందే. ఓ టోర్నీలో ఓడిన తర్వాత మళ్లీ వెంటనే ఇంకో టోర్నీ ఆడను. కాస్త సమయం తీసుకుంటా. తప్పులు దిద్దుకుంటా. కుటుంబంతో సమయాన్ని గడుపుతా. కానీ ఇప్పుడు తక్కువ విరామంలో టోర్నీలు ఆడాల్సి వస్తోంది. నార్వే చెస్ తర్వాత అమెరికాలో కెయిన్స్ కప్ ఆడబోతున్నా" అని హంపి తెలిపింది. క్యాండిడేట్ టోర్నీ గురించి ఎక్కువగా ఆలోచించట్లేదని.. ఎందుకంటే అర్హత సాధించడం అంత తేలిక కాదని ఆమె పేర్కొంది. "క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధిస్తే మంచిదే. దీని గురించి ఎక్కువగా ఆలోచించట్లేదు" అని హంపి తెలిపింది.

# రింకు నిశ్చితార్థం 8న





భారత క్రికెటర్ రింకు సింగ్‌తో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియ సరోజ్ నిశ్చితార్థం తేదీ ఖరారైంది. ఈనెల 8న వీరిద్దరి నిశ్చితార్థం జరుగుతుందని ప్రియ తండ్రి తూఫాని సరోజ్ ఆదివారం ధ్రువీకరించారు. ఈ ఏడాది నవంబరు 18న వారణాసిలో సంప్రదాయబద్ధంగా రింకు, ప్రియ వివాహం జరగనుంది. క్రికెట్, బాలీవుడ్, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను వివాహానికి ఆహ్వానించనున్నారు. నిశ్చితార్థం మాత్రం హడావుడి లేకుండా నిర్వహించనున్నారు. "అత్యంత సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థ వేడుక జరగనుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, దగ్గరి బంధువులు మాత్రమే హాజరవుతారు" అని తూఫాని పేర్కొన్నాడు. 27 ఏళ్ల రింకు 2 వన్డేలు, 33 టీ20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 26 ఏళ్ల ప్రియ మచ్‌లీషహర్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి తూఫానీ రెండు సార్లు ఎంపీగా వ్యవహరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA- 506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313. EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 7396206302, email: startrinethram28@gmail.com